# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-07-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా "సంజీవని" అనే ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలను ప్రారంభిస్తారు.**

**2. రాష్ట్రంలో ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.**

**3. రైతుల ప్రయోజనాల కోసం నీటిపారుదల, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు.**

**4. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌గా నిలుస్తుందని ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.**

=========================

కర్నూలు జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పర్యటిస్తారు. ఆలూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు ఆరోగ్య సేవలు సులభంగా అందించేలా "సంజీవని" అనే ఏఐ ఆధారిత సేవలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. అనంతరం ఆస్పత్రిలోని ప్రజావేదిక వద్దకు చేరుకొని బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. ఆ తరువాత స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అవుతారు.

-------------------------

గుంతకల్-బళ్లారి మధ్య 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ రైల్వే లైన్లతో తూర్పు- పడమర రైల్వే కారిడార్ బలోపేతం కావడంతో పాటు రాయలసీమ, ఉత్తర కర్ణాటక, గోవా ప్రాంతాల మధ్య రవాణా సౌలభ్యం పెరుగుతుందని తెలిపారు. కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులకు మెరుగైన రవాణా అనుసంధానం లభించడంతో పాటు పారిశ్రామిక అభివృద్ధి, సరకు రవాణా వేగవంతం అవుతాయని, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల లక్షలాది మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ముఖ్యమంత్రి వివరించారు.

-------------------------

రాష్ట్రంలో ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. విశాఖపట్నంలోని సింహపురి ఈ-బస్సు డిపో పవర్ రూమ్‌ను ఈరోజు ఆయన ప్రారంభించారు. అనంతరం డిపోలో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్, ఛార్జింగ్ స్టేషన్‌తో పాటు ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రధాన మంత్రి ఈ-బస్ సేవా పథకం కింద రాష్ట్రానికి తొలి దశలో 750 ఈ-బస్సులు మంజూరయ్యాయని, వాటిలో 100 బస్సులు విశాఖపట్నానికి కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుత బస్సులతో పాటు కొత్త ఈ-బస్సులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, నాణ్యమైన, పర్యావరణహిత ప్రజా రవాణా సేవలు అందించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రైతుల ప్రయోజనాల కోసం నీటిపారుదల, రెవిన్యూ అధికారులు సమన్వయంతో పని చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. గోదావరి, కృష్ణా డెల్టాల అధికారులతో ఆయన ఈరోజు శ్రవణ మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా సీలేరు జలాలను గోదావరి డెల్టా ఖరీఫ్ అవసరాలకు వినియోగిస్తున్నామని తెలిపారు. పుష్కర కాలువ, ఏలేరు వ్యవస్థల ద్వారా వచ్చే నీటిని తాగునీరు, ఆరుతడి పంటలకే వినియోగించాలని సూచించారు. ఈ నీటితో తూర్పుగోదావరి, కాకినాడ, విశాఖ జిల్లాల్లో 55 లక్షల మందికి తాగునీరు అందాల్సి ఉందన్నారు.

---------------------------

తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యత ఇస్తూనే, రైతులకు సాగునీటి కొరత తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని జలవనరుల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ -ఈఎన్‌సీ కె. నరసింహమూర్తి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం ఇరిగేషన్ కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో గోదావరి నదీ ప్రవాహ పరిస్థితులు, డెల్టా ప్రాంతాలకు సాగునీటి సరఫరా, తాగునీటి లభ్యతపై ఆయన వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం గోదావరిలో తగినంత నీటి ప్రవాహం ఉన్నందున తాగునీటి అవసరాలతో పాటు సాగునీటి అవసరాలను కూడా సమర్థవంతంగా తీర్చేందుకు కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. డెల్టా చివరి ప్రాంతాల వరకు నీరు సకాలంలో చేరేలా సాగునీటి సంఘాలు, రైతులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచిస్తూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌గా నిలుస్తుందని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు-ఎంఎస్‌ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. భోగాపురంలో "భూమి నుంచి భవిష్యత్తు వరకు" పేరుతో నిర్వహించిన విమానాశ్రయ ప్రచార కార్యక్రమాన్ని ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విమానాశ్రయం ప్రారంభానికి కౌంట్‌డౌన్‌ను సూచించే డిజిటల్ టైమర్ వాల్ ను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో ఉత్తరాంధ్రలో పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. విమానాశ్రయం ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలోని పట్టణాలలో మురుగు నీటి కాలువల నిర్వహణకు యంత్రాలను వినియోగిస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి  పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలో జాతీయ సఫాయి కర్మచారి అభివృద్ధి కార్పొరేషన్ రుణాలతో కొనుగోలు చేసిన ఆరు వాహనాలను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మురుగు నీటి వ్యవస్థ నిర్వహణకు వాహనాలు, యంత్రాలు ఉపయోగించడం వల్ల పారిశుద్ధ్య కార్మికులకు పని సులభతరం అవుతుందన్నారు. సాంకేతికతతో పరిశుభ్రత  జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నారాయణ తెలియజేస్తూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 136వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాలలో ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారిణి జి. లక్ష్మి పేర్కొంటూ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

ముక్కోణపు సిరీస్‌లో భాగంగా జింబాబ్వే పర్యటనలో ఉన్న భారత పురుషుల క్రికెట్ జట్టు ఈరోజు రెండో టీ20 మ్యాచ్ ఆడనుంది. హరారె స్పోర్ట్స్ క్లబ్ వేదికగా సాయంత్రం నాలుగు గంటల 30 నిమిషాలకు భారత్, జింబాబ్వే జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభం కానుంది. కాగా మొదట మ్యాచ్‌లో భారత్ గెలుపొందింది. ఈ మ్యాచ్ గెలిస్తే సిరీస్ కైవసం చేసుకుంటుంది.

=====================